# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

ఆదివారం | 14 |జూన్ | 2026 | పేజీలు: 11


## భూగర్భ జలాల పెంపుదలకు రీఛార్జ్ బావుల నిర్మాణం చేపట్టాలి

9 లో





4 లో

# 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

పి.మీరాహుస్సేన్ ఖాన్

-విజయవాడ, మనంబ్యూరో

యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ముఖ్యమంత్రి..
అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి..
జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

## మహిళ ఆర్థికంగా బలపడితేనే కుటుంబం బలపడుతుంది

మహిళల సాధికారతకు ఆర్థిక స్వావలంబననే బలమైన పునాది

ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

4 లో




## యోగతో ఒత్తిడికి దూరం... ఆరోగ్యానికి చేరువ

3 లో

యోగను జీవితంలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం

యోగతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం

కలెక్టర్ సాయికాంత్ వర్మ

మంగళగిరిలో జిల్లా స్థాయి యోగ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



## భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు
# గుంతలు సమర్థవంతమైన మార్గం



**▶▶ గీతా మందిర్ సెంటర్ నూతన అపార్ట్మెంట్లో ఇంకుడు గుంతల ప్రారంభోత్సవం**

**▶▶ అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ,జూన్13(మనంన్యూస్)**: నందిగామ పట్టణంలోని గీతా మందిర్ సెంటర్ వద్ద నూతన అపార్ట్మెంట్లో శనివారం నిర్వహించిన ఇంకుడు గుంతల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను ప్రారంభించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న నీటి సమస్యలను అధిగమించేం దుకు ప్రతి నివాస సముదాయం, అపార్ట్మెంట్, ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల్లో ఇంకుడు గుంతల నిర్మాణం అవసరమని ఆమె పేర్కొన్నారు. అనంతరం అపార్ట్మెంట్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల అవగాహన వాల్ పోస్టర్ను ఎమ్మెల్యే సౌమ్య ఆవిష్కరించారు. జల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, అపార్ట్మెంట్ నివాసితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యాసంస్థలు కృషి చేయాలి

**▶▶ తలిత క్యూమీ ఉన్నాలీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య**



**నందిగామ,జూన్13(మనం న్యూస్)**: నందిగామ పట్టణంలోని పల్లోటి స్కూల్లో శనివారం నిర్వహించిన 'తలిత క్యూమీ ఉన్నాలీ' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లోటి స్కూల్స్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవరచుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దడంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. అనంతరం స్కూల్ యాజమాన్యం నిర్వహించిన వివిధ కార్యక్రమాలను పరిశీలించిన తంగిరాల సౌమ్య విద్యార్థుల ప్రతిభను అభినందించి, వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.

# ప్రజల ఇబ్బందులు కనిపించడం లేదా..?




**కంచకచర్ల,జూన్13(మనం న్యూస్)**: ఈరోజు కంచికచర్ల వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు మొండితోక జగన్మోహనరావు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీరులపాడు మండలం లో అన్ని గ్రామాలకు జుజ్జూరు రోడ్డు లో ఒక పొలం లో వెళ్ళే పైప్ లైన్ రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ఎలాంటి వర్క్ ఆర్డర్స్ లేకుండా, పైప్ లైన్ రూట్ మార్చే ప్రయత్నం చేస్తున్నారు. సదరు వ్యవహారంలో చాలా పెద్ద మొత్తంలో లంచం గా అధికారులకు, కొన్ని రోజులుగా త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులు, లోకల్ అధికార పార్టీ నాయకులు చేసిన అవినీతి నిర్వాకం కారణమని దుయ్యబట్టారు. కంచికచర్ల రాజకీయ నాయకులకు చేతులు మారినట్టు అనుకుంటున్నారని తెలిపారు. ఈ పైప్ లైన్ మార్చే విషయం లో అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై వీరులపాడు మండలం లో అన్ని గ్రామాల ప్రజలను త్రాగు నీరుకు ఇబ్బంది గురిచేస్తున్నారు అని ఆరోపించారు. అలాగే కంచెలమ్మ చెరువు మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండానే వేలాది ట్రాక్టర్ లు మట్టిని అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల పట్టణ అధ్యక్షులు వేమ సురేష్ బాబు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మంగళపూడి కోటిబాబు, పట్టణ ఉపాదాక్ష్యుడు అమర్లపూడి యోహాన్, ఎంపీటీసీ మాడుగుల మధుబాబు, మాడుగుల శంకర్ పాల్గొన్నారు

# భక్తుల సౌకర్యమే ధ్యేయంగా ట్రాఫిక్ ఆంక్షలు

**▶▶ తిరుపతమ్మ తల్లి భక్తిలో ఎస్ఐ అర్జున్**

**పెనుగంచిప్రోలు,జూన్13(మనం న్యూస్)**: నిత్యం భక్తులతో కళకళలాడే పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి క్షేత్రంలో రేపు ఆదివారం భారీ భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్లకు నో ఎంట్రీ

భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మునేర్ బ్రిడ్జి పైకి ఇసుక ట్రాక్టర్లను అనుమతించబోము. ట్రాక్టర్ల యజమానులు పోలీసు వారికి సహకరించగలరు.

### భారీ వాహనాల రూట్ మళ్లింపు.

జగ్గయ్యపేట వైపు నుంచి వచ్చే ట్రాక్టర్లు మరియు భారీ వాహనాలన్నీ బైపాస్ రోడ్డు గుండా పార్కింగ్ ప్రదేశంలోకి వెళ్లవలసిందిగా సూచించారు. ఖమ్మం వైపు వెళ్లే వాహనాలు బైపాస్కు వెళ్లకుండా ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా వెళ్లవలసి ఉంటుంది.

### భక్తి భావంతో విధి నిర్వహణ – సిబ్బందిని కోఆర్డినేట్ చేస్తున్న అర్జున్



ఈ సందర్భంగా ఎస్ఐ అర్జున్ మాట్లాడుతూ, 'తిరుపతమ్మ తల్లి అంటే మాకు ఎంతో భక్తి భావం. ఆ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, సురక్షితంగా, సాఫీగా దర్శనం చేసుకునేలా చూడటమే మా ప్రథమ కర్తవ్యం. భక్తుల సౌకర్యమే ధ్యేయంగా ఈ ట్రాఫిక్ మళ్లింపులు చేశాం' అని అన్నారు.

### హైలైట్....

ఎస్ఐ అర్జున్ తన సిబ్బందిని రోజూ ఇద్దరేసి చొప్పున మామిడి తోటల్లో రౌండ్స్కు పంపిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉంచుతున్నారు. సిబ్బందిని సమర్థంగా కోఆర్డినేట్ చేసుకుంటూ, తిరుపతమ్మ తల్లి పట్ల ఉన్న భక్తి భావంతో ముందుకు వెళ్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు.విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే, భక్తుల పట్ల ఆప్యాయత చూపడం అర్జున్ ప్రత్యేకతగా నిలుస్తుంది. ఆదివారం వచ్చే భక్తులందరూ పోలీసు వారి సూచనలు పాటించి, అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకోవాలని ఎస్ఐ అర్జున్ కోరారు.

# ప్రకృతి స్ఫూర్తితో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ 'నువా' కలెక్షన్

**గుంటూరు జూన్ 13 మనం న్యూస్**: మలబార్ గోల్ అండ్ డైమండ్స్ తన తాజా న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్ నువాను ఆవిష్కరించింది. ప్రకృతిలో కనిపించే సున్నితమైన ఆకృతులు, సహజ నిర్మాణాలు, తేనెగూడు నమూనాలు, భూమి సహజంగా సృష్టించిన ఆకారాలు వంటి అద్భుతాల నుంచి స్ఫూర్తి పొంది ఈ కలెక్షన్ రూపొందించబడినట్లు సంస్థ వెల్లడించింది. 18 క్యారెట్, 14 క్యారెట్ బంగారంతో రూపొందించిన ఈ ఆభరణాల్లో న్యాచురల్ డైమండ్స్ను రంగురంగుల రత్నాలు, సిరామిక్ కలర్ ఎనామెలింగ్, బహువర్ణ రోడియం ఫినిష్లతో సమన్వయం చేసి ప్రత్యేక ఆకర్షణీయతను తీసుకొచ్చారు. ఆధునిక విలాసవంతమైన శైలిని, ప్రకృతి అందాలను మేళవిస్తూ వివిధ సందర్భాలకు అనువుగా ఈ డిజైన్లు తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ కలెక్షన్కు బ్రాండ్ అంబాసిడర్గా ప్రముఖ నటి కరీనా కపూర్ ఖాన్ కొనసాగుతున్నారు. ఆమె సహజ సొగసు, ఆత్మవిశ్వాసం, ఆధునిక స్త్రీత్వానికి ప్రతీకగా నిలుస్తూ 'నువా' కలెక్షన్ భావాన్ని ప్రతిబింబిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ. అహ్మద్ మాట్లాడుతూ, ప్రకృతి సృష్టిలోని సూక్ష్మ నిర్మాణాలు, అందాలను ఆధునిక న్యాచురల్ డైమండ్ ఆభరణాల రూపంలో అందించాలనే ఉద్దేశంతో 'నువా'ను రూపొందించామని చెప్పారు. సొగసుతో పాటు నేటి మహిళల జీవనశైలికి అనుగుణంగా ఉండేలా ప్రతి డిజైన్ను తీర్చిదిద్దినట్లు వివరించారు. సరళమైన విలాసాన్ని, అర్థవంతమైన డిజైన్ను ఇష్టపడే మహిళలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ కలెక్షన్ ద్వారా మలబార్ గోల్ అండ్ డైమండ్స్ తన న్యాచురల్ డైమండ్ పోర్ట్ఫోలియోను మరింత విస్తరించుకుంటోందని సంస్థ వెల్లడించింది.





# నిత్య యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుంది

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

**గుంటూరు, జూన్ 13 : (మనం న్యూస్ ప్రతినిధి)**: ప్రజల దైనందిత జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.15 రోజుల యోగ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించారు. తొలుత యోగ శాస్త్ర పితామహుడు మహర్షి పతంజలి చిత్రపటానికి పూలమాలవేసి,యోగ గురువులతో కలసి జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన అలవాట్ల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన సాధనం యోగ యని, వివిధ దేశాల ప్రజలు యోగాను ఆచరిస్తున్న పరిస్థితుల్లో గుంటూరు జిల్లా ప్రజలు కూడా ప్రతిరోజు వారి దినచర్యలో భాగంగా యోగాన్ని మలుచుకోవటానికి ప్రయత్నించాలన్నారు. అనారోగ్య సమస్యలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యం తో పాటు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉంచుతుందన్నారు.యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా అనేది కేవలం కొన్ని ఆసనాలకు మాత్రమే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు.నిత్యం యోగా సాధన వల్ల ఒత్తిడి లేని ఉత్సాహభరితమైన, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అలవడుతుందని తెలిపారు. యోగాను మన పూర్వీకులు అందించిన అమూల్యమైన సాంస్క ృతిక వారసత్వంగా పేర్కొన్నారు.ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు, సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాణాయామం వంటి యోగా సాధనలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. యోగా గురువు విజయ గౌరి సూర్య మంత్రంతో సూర్య నమస్కారాలు, యోగా ద్వారా సమతుల్య ఆహారం ఎలా తీసుకోవాలి అనే విషయాన్ని ప్రదర్శించారు.ఆయుష్మాన్.శాఖ అధికారి జి విజయానంద్ కార్యక్రమంలో పాల్గొన్న వారిచే యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమం అనంతరము యోగా గురువు విజయ గౌరి మరియు ఆయుష్మాన్ శాఖ అధికారి జి.రామానంద్ లను జిల్లా కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డా.విజయలక్ష్మీ ,జిల్లా పర్యాటక అధికారి రమ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

















## 21న నగరంలో అంతర్జాతీయ
# యోగా దినోత్సవ వేడుకలు

**యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ముఖ్యమంత్రి**

**అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

(విజయవాడ,మనం బ్యూరో)ః ఈ నెల 21వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.ఈ నెల 21న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎం. రాజశేఖర్ బాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తదితరులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సుమారు 5,000 మంది యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజలు యోగా ఆసనాల్లో పాల్గొనేందుకు రానున్నరన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక వర్షం కురిసే అవకాశం ఉంటే కార్యక్రమాన్ని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, యోగా సాధకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పూర్తి చేసి, ప్రాంగణాన్ని సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలి

**బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**

మార్కాపురం,జూన్,13,(మనం న్యూస్): డీఎస్సీ నియామకాల అంశంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారం తగదని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. యువత భవిష్యత్తుతో ముడిపడిన కీలకమైన అంశాలపై బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ విద్యార్థులు, నిరుద్యోగ యువతలో గందరగోళం సృష్టించే ప్రయత్నాలను వైకాపా నాయకులు వెంటనే విరమించుకోవాలని హితవు పలికారు. ఏవైనా అక్రమాలు జరిగాయని భావిస్తే తగిన ఆధారాలతో చట్టపరంగా పోరాటం చేయవచ్చని, కానీ నిరాధార ఆరోపణలతో యువతను రెచ్చగొట్టడం సమంజసం కాదన్నారు. డీఎస్సీ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని సంబంధిత అధికారులు ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చినప్పటికీ, కూటమి ప్రభుత్వంపై బురదజల్లాలనే ఉద్దేశంతో వైకాపా అసత్య ప్రచారానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం రాజకీయ పార్టీల బాధ్యత అని, తప్పుడు ప్రచారాలతో విద్యార్థులు, యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని కోరారు.



## మహిళ ఆర్థికంగా బలపడితేనే
# కుటుంబం బలపడుతుంది




- **మహిళల సాధికారతకు ఆర్థిక స్వావలంబననే బలమైన పునాది**
- **ఆర్థిక స్వాతంత్య్రం మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది**
- **జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

విజయవాడ రూరల్,జూన్,13,(మనం న్యూస్): మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని కుటుంబం బలపడితేనే సామాజం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక స్వాతంత్య్రం మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్ సెంటర్లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్ నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వ చేసి పౌడర్ రూపంలో ప్రాసెస్ చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మహిళలు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణలు మహిళలలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు సోలార్ డ్రైయింగ్ ప్రక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై మహిళలకు వివరించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి. నాంచారరావు, అగ్రో ఎంటర్ప్రైజెస్ ప్రతినిధి పవన్కుమార్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, రైజ్ సెంటర్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



# యూరో-ఆంకాలజీ చికిత్సలో ఆధునిక విధానాలపై రాష్ట్రస్థాయి వైద్య సదస్సు




- రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 200 మందికి పైగా యూరాలజిస్టుల నమోదు
- యూరో-ఆంకాలజీ సింప్లిఫైడ్ - 2026 పేరుతో ప్రత్యేక సదస్సు
- రోబోటిక్ శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రదర్శనలు
- ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రాశయ క్యాన్సర్లపై ప్రత్యేక చర్చలు
- సోగస్-ఏపీ ఆధ్వర్యంలో తొలి మిడ్టర్మ్ కాన్ఫరెన్స్

**గాంధీనగర్ జూన్ 13 మనం న్యూస్:** మూత్రపిండాలు, ప్రోస్టేట్, మూత్రాశయ క్యాన్సర్ల చికిత్సలో అత్యాధునిక వైద్య విధానాలు, రోబోటిక్ శస్త్రచికిత్సలు, శాస్త్రీయ ఆధారాలతో కూడిన వైద్య నిర్ణయాలు, శస్త్రచికిత్సా నైపుణ్యాలపై వైద్యులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ నెల 14న నగరంలో రాష్ట్రస్థాయి వైద్య సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ వెల్లడించింది.సొసైటీ ఆఫ్ జెనిటో యూరినరీ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సోగస్-ఏపీ) ఆధ్వర్యంలో, విజయవాడ అసోసియేషన్ ఆఫ్ జెనిటో యూరినరీ సర్జన్స్ (వేగస్) సహకారంతో యూరో-ఆంకాలజీ సింప్లిఫైడ్ - 2026 పేరిట ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా యూరాలజీ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, యూరో-ఆంకాలజీ రంగంలో తాజా పరిణామాలను పంచుకునే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించబడుతోంది. సోగస్-ఏపీ ఏర్పాటైన తరువాత నిర్వహిస్తున్న తొలి మిడ్టర్మ్ కాన్ఫరెన్స్ కావడం ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 200 మందికి పైగా యూరాలజిస్టులు, శస్త్రచికిత్స నిపుణులు, యువ వైద్యులు, పీజీ విద్యార్థులు ఇప్పటికే నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లబ్బీపేటలోని ప్రశాంత్ హాస్పిటల్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సదస్సు వివరాలను ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.వి. కృష్ణ కిషోర్, వేగస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సైంటిఫిక్ కన్వీనర్ డాక్టర్ పి. శ్రీమన్నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె. ప్రియతమ్, ఆర్గనైజింగ్ ట్రెజరర్ డాక్టర్ కె. ధీరజ్, పేట్రన్ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. డాక్టర్ ఎ.వి. కృష్ణ కిషోర్ మాట్లాడుతూ విజయవాడ నగరం యూరాలజీ అకాడమిక్ కార్యక్రమాలకు ఎప్పటినుంచో ముఖ్య కేంద్రంగా నిలుస్తోందని అన్నారు. వేగస్ ఆధ్వర్యంలో అనేక రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి యూరాలజీ సదస్సులు విజయవంతంగా నిర్వహించామని, ఈ సదస్సు ఆ అకడమిక్ సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. వేగస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సైంటిఫిక్ కన్వీనర్ డాక్టర్ పి. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యూరో-ఆంకాలజీ అనేది యూరాలజీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రత్యేక విభాగమని తెలిపారు. ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రాశయ క్యాన్సర్ల నిర్వహణలో ఆధునిక చికిత్సా విధానాలు, క్లిష్టమైన శస్త్రచికిత్సలు, వైద్య నిర్ణయాలపై వైద్యులకు ప్రయోగపూర్వక అవగాహన కల్పించే విధంగా సదస్సు రూపొందించబడిందన్నారు. కేసు ఆధారిత చర్చలు, నిపుణుల ఉపన్యాసాలు, ప్రత్యక్ష శస్త్రచికిత్సల ద్వారా వైద్యులకు ఉపయోగపడే శాస్త్రీయ కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె. ప్రియతమ్ మాట్లాడుతూ ఈ సదస్సులో కేసుల ఆధారిత చర్చలు, వైద్య నిపుణులతో ప్రత్యక్ష పరస్పర చర్చలు, క్లిష్ట కేసుల పరిష్కార మార్గాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యూరాలజీ విభాగంలో శిక్షణ పొందుతున్న యువ వైద్యులు, పీజీ విద్యార్థులకు ఈ సదస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆర్గనైజింగ్ ట్రెజరర్ డాక్టర్ కె. ధీరజ్ మాట్లాడుతూ ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రాశయ క్యాన్సర్ల చికిత్స కోసం పెద్ద నగరాల్లోని క్యాన్సర్ కేంద్రాలకు వెళ్లాల్సిందేనని చాలామంది రోగులు భావిస్తారని, అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ప్రపంచ స్థాయి యూరో-ఆంకాలజీ సేవలు, రోబోటిక్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సదస్సులో ప్రధానాంశంగా రోబోటిక్ రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రోబోటిక్ పార్షియల్ నెఫ్రెక్టమీ శస్త్రచికిత్సలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యక్ష శస్త్రచికిత్సల ద్వారా వైద్యులకు అత్యాధునిక సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన లభిస్తుందని చెప్పారు. పేట్రన్ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ వైద్యరంగంలో జరుగుతున్న వేగవంతమైన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా వైద్యులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శాస్త్రీయ సదస్సులు వైద్యుల జ్ఞానాన్ని, శస్త్రచికిత్సా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా యూరాలజిస్టులు, శస్త్రచికిత్స నిపుణులు, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూరో-ఆంకాలజీ రంగంలో తాజా వైద్య విధానాలు, సాంకేతిక పరిణామాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఒక ముఖ్య వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రాశయ క్యాన్సర్లను ముందస్తుగా గుర్తిస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని, మూత్రంలో రక్తం కనిపించడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే యూరాలజిస్టును సంప్రదించాలని నిర్వాహకులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

## ఎన్ఆర్ఐల కోసం ఐడీబీఐ బ్యాంక్
# ప్రత్యేక విదేశీ కరెన్సీ డిపాజిట్ పథకం

**గాంధీనగర్, జూన్ 13 మనం న్యూస్:** సురక్షితమైన, ఆకర్షణీయమైన విదేశీ కరెన్సీ పెట్టుబడి అవకాశాలను కోరుకునే ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐలు) కోసం ఐడీబీఐ బ్యాంక్ అమెరికన్ డాలర్లలో ఎఫ్సీఎన్ఆర్(బి) 'ప్రత్యేక అవకాశ డిపాజిట్' పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. విదేశీ కరెన్సీ డిపాజిట్లపై మెరుగైన రాబడులు అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు బ్యాంకు వెల్లడించింది. ఈ ప్రత్యేక వడ్డీ రేట్లు జూన్ 11, 2026 నుంచి సెప్టెంబర్ 30, 2026 వరకు పరిమిత కాలానికి మాత్రమే అమల్లో ఉంటాయని తెలిపింది. పథకం ప్రకారం 10 లక్షల అమెరికన్ డాలర్ల వరకు డిపాజిట్ చేసే వారికి 3 సంవత్సరాల నుంచి 4 సంవత్సరాల లోపు కాలపరిమితికి 6 శాతం, 4 నుంచి 5 సంవత్సరాల లోపు 6.05 శాతం, 5 సంవత్సరాల కాలానికి 6.10 శాతం వడ్డీ లభించనుంది. అలాగే 10 లక్షల అమెరికన్ డాలర్లకు మించి 50 లక్షల అమెరికన్ డాలర్ల వరకు డిపాజిట్లపై గరిష్ఠంగా 6.15 శాతం, 50 లక్షల అమెరికన్ డాలర్లకు మించిన డిపాజిట్లపై గరిష్ఠంగా 6.20 శాతం వరకు వడ్డీ అందించనున్నారు. ఈ పథకంలోని ముఖ్యాంశాల్లో అసలు నగదు, వడ్డీ మొత్తాలను పూర్తిగా స్వదేశానికి తిరిగి తీసుకువెళ్లే సౌకర్యం ఉండటం విశేషం. డిపాజిట్లు కేవలం అమెరికన్ డాలర్లలోనే నిర్వహించబడటంతో మారకపు విలువల హెచ్చుతగ్గుల ప్రభావం ఉండదని బ్యాంకు పేర్కొంది. ప్రస్తుత నిబంధనలకు లోబడి ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి భారతదేశంలో ఆదాయపు పన్ను మినహాయింపు లభించే అవకాశం ఉందని తెలిపింది. కనీసంగా ఒక సంవత్సరం పాటు డిపాజిట్ కొనసాగించాల్సి ఉంటుందని వెల్లడించింది.

# విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు



**నందిగామ,జూన్13(మనంన్యూస్):** నందిగామ మండలంలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడ డిప్యూటీ ఈఈ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 40 బృందాలు 1,968 విద్యుత్ కనెక్షన్లు, 76 వ్యవసాయ పంపుసెట్లను పరిశీలించాయి. ఈ తనిఖీల్లో 462 సర్వీసుల్లో అదనపు విద్యుత్ వినియోగాన్ని గుర్తించిన అధికారులు, సదరు వినియోగదారులకు రూ.13 లక్షల అపరాధ రుసుము విధించినట్లు వెల్లడించారు.

# శ్రీ గోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో అన్న వితరణ

**గాంధీనగర్, జూన్ 13:(మనం న్యూస్):** శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీ బాబు ఆధ్వర్యంలో శనివారం కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పూజ కార్యక్రమం అనంతరం పాత గవర్నమెంట్ హాస్పటల్ దగ్గర అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గత ఆరు సంవత్సరాలుగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దాత పరిమికాయల నిర్వాణ కృష్ణ సహకారంతో అన్నవితరణ చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్, గద్దల ధనలక్ష్మి, దత్తి జ్యోతి, పబతి కృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# 'సర్' సర్వేకు ప్రజలు రాజకీయ పార్టీల బిఎల్ఏలు సహకరించాలి



**పామర్రు , జూన్ 13 ( మనం న్యూస్ ) :** ఈ నెల 15 నుంచి రాష్ట్రం వ్యాప్తంగా చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సర్వేకు అన్ని రాజకీయ పార్టీల బి ఎల్ ఏ లు, ప్రజలు సహకరించి కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలోని 148వ పోలింగ్ బూత్ లెవల్ అధికారిణి కంఠంనేని పల్లవి కోరారు. శనివారం 'సర్' ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు నూతన ఓటర్లకు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ,భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకే 'సర్' కార్యక్రమాన్ని ప్రధాన లక్ష్యంగా చేపట్టినట్టు తెలిపారు. ఈ నెల 15 నుంచి జూలై 15 వరకు ఇంటింటి సర్వే గణన ప్రారంభం కానున్నందున, ప్రతి ఇంటికీ వచ్చే బి ఎల్ ఓ లు ఎన్యుమరేషన్ ఫారాలు అందిస్తారని, వాటిని పూరించే విషయంలో రాజకీయ పార్టీలు బీఎల్ఏ ద్వారా సహకరించాలని పల్లవి కోరారు. ఇందుకు సంబంధించి 'సర్'పై ప్రజలకు ఎలాంటి అపోహలు, అనుమానాలు కలుగకుండా తమవంతు బాధ్యతగా అవగాహన కల్పించడం జరుగుతుందని సూచించారు. మ్యాపింగ్తో సంబంధం లేకుండా ఎన్యుమరేషన్ ఫారాలు పూరించి సమర్పించిన ప్రతి ఓటరును సెప్టెంబర్ 22న ప్రచురించే ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చనున్నట్టు తెలిపారు. ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను అధికారిక పోర్టల్లో కూడా ర్సొటట్ఛిజీ.జౌర.జీ ద్వారా ఆన్లైన్లో ద్వారా సమర్పించవచ్చని చెప్పారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



## 130 మందికి పరీక్షలు, మందుల పంపిణీ

విజయవాడ పశ్చిమ జూన్ 13 ( మనం న్యూస్ ): పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలోని 'సుజనా ఫౌండేషన్' నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. హెచ్బీ కాలనీలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్థానికులు పెద్దఎత్తున సద్వినియోగం చేసుకున్నారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్స్రే తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. జనరల్ మెడిసిన్, దంత, నేత్ర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సుమారు 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు .ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రతి వారాంతంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కోరారు.శిబిరంలో ఆంధ్ర హాస్పిటల్స్కు చెందిన వైద్యులు, శంకర నేత్ర చికిత్సాలయ నిపుణులు, ప్రభుత్వ దంత ఆసుపత్రి వైద్యులు, టెక్నీషియన్లు, మాజీ కార్పొరేటర్లు, కూటమి నాయకులు, సుజనా మిత్ర కోఆర్డినేటర్లు పాల్గొని సేవలందించారు.

# ఇంద్రకీలాద్రిపై మూడంచెల భద్రత భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం



విజయవాడ, జూన్ 13 ( మనం న్యూస్): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు తిరుమల తరహాలో మూడంచెల భద్రతా తనిఖీ వ్యవస్థను అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ తెలిపారు.ఇంజినీరింగ్, భద్రతా సిబ్బందితో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన ఆయన, భక్తులను మూడు వేర్వేరు పాయింట్ల వద్ద తనిఖీ చేసిన తర్వాతే ఆలయ ప్రాంగణంలోకి అనుమతించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. మహామండపం, ఓం టర్నింగ్, కొత్త రాజగోపురం, చిన్న రాజగోపురం, ప్రధాన ఆలయం వెనుక స్కానింగ్ కేంద్రాల వద్ద దశలవారీగా తనిఖీలు నిర్వహించనున్నట్లు వివరించారు.ఆలయ పవిత్రత, భద్రత దృష్ట్యా మొబైల్ ఫోన్లను ఆలయ ప్రాంగణంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. భక్తులు తమ ఫోన్లను డిపాజిట్ కౌంటర్లలో అప్పగించాలని సూచించారు.అదే సమయంలో వృద్ధులు, వికలాంగులు, చంటి పిల్లల తల్లుల కోసం ఉచిత బ్యాటరీ వాహనాల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. శారీరక ఇబ్బందులు ఉన్న భక్తులకు లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, నూతన వ్యవస్థ నిర్వహణ కోసం శిక్షణ పొందిన భద్రతా సిబ్బందితో పాటు సేవా వాలంటీర్లను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.భక్తుల భద్రతే దేవస్థాన ప్రథమ కర్తవ్యమని, ఈ మార్పులకు భక్తులు సహకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

# రెండేళ్లలో అభివృద్ధి-సంక్షేమంలో కూటమి ముందంజ



## ప్రజల తీర్పే వైసీపీ వైఫల్యాలకు నిదర్శనమన్న బొండా ఉమా

విజయవాడ సెంట్రల్, జూన్ 13 (మనం న్యూస్ ): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకుందని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సింగ్నగర్లోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం భారీ అప్పుల భారంలో కూరుకుపోయిందని, పలు రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొందని విమర్శించారు. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ విఫలమైందని, అందుకే ప్రజలు ఆ పార్టీని 153 స్థానాల నుంచి 11 స్థానాలకు పరిమితం చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమికి 164 స్థానాలు కట్టబెట్టడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేలకుపెంచామని, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ప్రయోజనం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హ కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయాలు, రైతులకు చేయూత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా రహదారులు, మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యా రంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజునే విద్యార్థులకు యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, బ్యాగులు అందుబాటులో ఉంచామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, మద్యం కుంభకోణాలు తదితర అంశాలపై విచారణలు కొనసాగుతున్నాయని, సంబంధిత దర్యాప్తు సంస్థలు ఆధారాలతో కేసులను పరిశీలిస్తున్నాయని అన్నారు. ప్రజలు ఒక్కసారి మోసపోవచ్చుగానీ పదేపదే మోసపోరని, అందుకే గత ఎన్నికల్లో వైసీపీని తిరస్కరించి కూటమికి భారీ మెజార్టీ ఇచ్చారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా మరింత ముందుకు తీసుకెళ్తూ ప్రతి హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా వేదికపై ప్రభుత్వ పనితీరు, హామీల అమలుపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# వెలంపల్లిని కలిసిన బండి పుణ్యశీల

## రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకంపై కృతజ్ఞతలు

విజయవాడ పశ్చిమ జూన్ 13(మనం న్యూస్)ః వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవల నియమితులైన బండి పుణ్యశీల శనివారం మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తన నియామకానికి సహకరించినందుకు వెలంపల్లికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా బండి పుణ్యశీలను వెలంపల్లి శ్రీనివాసరావు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై సమర్థంగా స్పందించాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ఆమె కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కూటమి నేతలు వంద సార్లు అబద్ధాన్ని నిజం చేయాలన్న అది నిజం కాలేదు

## వైకాపా స్టేట్ సెక్రటరీ మద్దుకూరి సాయిబాబు.



నందిగామ,జూన్13(మనం న్యూస్)ః వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో మొండితోక జగన్ మోహన్ రావు చెప్పినట్లు నందిగామ కు ఆర్డీఓ కార్యాలయం తీసుకొచ్చిన, వంద పడకల ఆసుపత్రి కేంద్రీయ విద్యాలయం, జగజ్జీవన్ రామ్ భవన్, ఎన్టీఆర్ రోడ్డు విస్తరణ, రామన్నపేట రోడ్డు విస్తరణ, పట్టణంలో పలు రోడ్లు విస్తరణాలు, ఆర్డీవో కార్యాలయం మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అన్ని జగన్మోహన్ రావు వైఎస్ జగన్ హయాంలోనే జరిగాయి అని వైకాపా స్టేట్ సెక్రటరీ మద్దుకూరి సాయిబాబు తెలియ పర్చారు, కానీ ఇవన్నీ వక్రీకరించి మా హయాంలోనే తెచ్చామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. మీరు ప్రజా ప్రతినిధుల్లా వ్యవహరించడం లేదు చిన్న పిల్లల మాట్లాడుతున్నారు.కేంద్రీయ విద్యాలయం వంద పడకల ఆసుపత్రికి పేపర్ వర్క్ అంతా 2022 నుంచి ప్రారంభమైంది. ఎన్ ఓ సి 2024 లో వచ్చింది ఇవన్నీ ఎవరు హాయంలో వచ్చాయి వైకాపా హయాంలో వచ్చాయి.తెదేపా నేతలు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తే మీరు తెచ్చినట్లేనా? ప్రజలు గమనిస్తున్నారు డాక్టర్ గా ఉన్న జగన్మోహన్ రావు పేదలకు ఆరోగ్యం అందాలనే ఉద్దేశంతో నందిగామలో వంద పడకల ఆసుపత్రి సాంక్షన్ చేపించారు. నియోజకవర్గంలో చందర్లపాడు రోడ్డు, గుడిమెట్ల రోడ్డు ఇక గ్రామాలకు వెళ్లే ప్రతి రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది.మీరు ఏమి తెచ్చారో ప్రజలకు తెచ్చి చూపించండి మేము తెచ్చినవి మీరు తెచ్చామని చెప్పుకోవడం కాదు... సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి మేమే తెచ్చామంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు పాత చింతకాయ పచ్చడి పోస్టులు రోజు పెడితే ఏమి లాభం....

# రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చిన్నారికి అధునాతన లైఫ్‌సేవింగ్ థెరపీ తో విజయవంతంగా చికిత్స




**రాజమండ్రి,జూన్,13,(మనం న్యూస్):** పిల్లలకు అధునాతన పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ ఫలితాలను ఎలా మారుస్తుందో చెప్పడానికి శక్తివంతమైన ఉదాహరణగా, రాజమండ్రిలోని రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో జరిపిన తాజా వైద్య చికిత్స నిలుస్తుందని ఆ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ హేమ కుమార్, డాక్టర్ పృధ్వీతెలిపారు. తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం, షాక్ మరియు తీవ్రమైన కిడ్నీ గాయంతో వచ్చిన ఒక తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న ఏళ్ల వయస్సు గల పిల్లల జీవితాన్ని రక్షించడంలో ఈ అధినాతన వైద్య చికిత్స విధానం సహాయపడిందన్నారు. 25 రోజుల అత్యంత ప్రత్యేకమైన చికిత్స మరియు నిరంతర పర్యవేక్షణ తరువాత, పూర్తి నరాల సంబంధమైన పునరుద్ధరణ మరియు స్థిరమైన అవయవ పనితీరుతో బిడ్డ డిశ్చార్జ్ చేయబడిందని చెప్పారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న రోగులలో ఉపయోగించే డయాలసిస్ యొక్క అత్యంత ప్రత్యేకమైన రూపమైన కంటిన్యూయస్ రీనల్ రీప్లేస్మెంట్ థెరపీ (సీఆర్ఆర్టీ) అని, అటువంటి సంక్లిష్టమైన కేసును నిర్వహించడానికి పీడియాట్రిక్ ఇంటెన్సివిస్టు, నెఫ్రాలజిస్టు, క్రిటికల్ కేర్ నర్సులు, రెస్పిరేటరీ థెరపిస్టు మరియు అనుబంధ నిపుణుల ప్రత్యేక బృందం నుండి నిరంతరం పర్యవేక్షణ మరియు సమన్వయ సంరక్షణ అవసరం అన్నారు. పిల్లవాడిని తమ వద్దకు తీసుకువచ్చినప్పుడు, పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది, ఇప్పటికే అనేక అవయవాలు ప్రభావితమయ్యాయి. ఇటువంటి సందర్భాల్లో వేగవంతమైన నిర్ణయం తీసుకోవడం, అధునాతన సాంకేతికత మరియు నిరంతర బహువిధ సంరక్షణ అవసరం. మా క్రిటికల్ కేర్ టీమ్ యొక్క అచంచలమైన ప్రయత్నాల ద్వారా, మేము పిల్లలను స్థిరీకరించగలిగాము మరియు ఆరోగ్యంగా తిరిగి ఇంటికి తిరిగి రావడానికి సహాయం చేయగలిగాము అని చెప్పారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకు అందుబాటులో ఉన్న అత్యంత అధునాతన మూత్రపిండ సహాయ చికిత్సలలో ఒకటైన కంటిన్యూయస్ రీనల్ రీప్లేస్మెంట్ థెరపీ ని ఉపయోగించడం ఈ కేసు యొక్క ముఖ్యాంశం అని, రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్, రాజమండ్రి, ప్రస్తుతం పీడియాట్రిక్ సీ ఆర్ ఆర్ టీ సేవలను అందించడానికి ఈ ప్రాంతంలోని ఏకైక కేంద్రం అని చెప్పారు. అత్యంత ప్రత్యేకమైన పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ కోసం కుటుంబాలు ఇకపై పెద్ద మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఈ సామర్థ్యం నిర్ధారిస్తుంది, ప్రతి నిమిషం ముఖ్యమైనప్పుడు పిల్లలు ఇంటికి దగ్గరగా సకాలంలో చికిత్స పొందేలా చేస్తుందన్నారు. ఈ విజయవంతమైన రికవరీ అధునాతన సాంకేతికత, అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులు ఆధారిత చికిత్స ప్రోటోకాల్ల ద్వారా ప్రపంచ స్థాయి పీడియాట్రిక్ మరియు నియోనాటల్ హెల్త్కేర్ను అందించడంలో రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. ఈ ప్రాంతంలోనే అత్యంత సంక్లిష్టమైన పీడియాట్రిక్ ఎమర్జెన్సీలు మరియు క్లిష్ట అనారోగ్యాలను నిర్వహించడానికి ఆసుపత్రి యొక్క పెరుగుతున్న సామర్థ్యాన్ని కూడా ఇది ప్రతిబింబిస్తుందని చెప్పారు .

# ఎల్వోసీ చెక్కు అందచేసిన వల్లభనేని



**తాడేపల్లి, జూన్ 13, మనం న్యూస్:** అనారోగ్యంతో బాధపడుతున్న ఒక్కరికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్వోసీ చెక్కును శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తాడేపల్లి బైపాస్ రోడ్డు మెడ్ స్టార్ హాస్పిటల్ చికిత్స పొందుతూన్న సూరగాని కిరణ్ కి అందచేశారు.తాడేపల్లి 16 వ వార్డ్ కి చెందిన సూరగాని కిరణ్ గత వారంనుండి అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.ఈ సందర్భంగా సీఎం సహాయనిధి చెక్కును మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్ కు బాధితుడు కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మేకా పుల్లారెడ్డి, అద్దంకి మురళి, కొర్రపాటి విజయ్ కుమార్, అమీర్,హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కంటి చూపును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- **శుక్లాల సమస్యకు శస్త్రచికిత్సే శాశ్వత పరిష్కారం**
- **ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**విజయవాడ,జూన్, 13,(మనం ప్రతినిధి):** ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుక్లాల (ముత్యబిందు) కారణంగా చూపు మందగించిన వారు ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శంకర నేత్రాలయ వైద్యులు డా. మాధవ్, డా. అపర్ణల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి సంబంధించిన పోస్టర్ను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్లోని ఆయన చాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనిషికి ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన వరాల్లో కనుచూపు ఒకటని అన్నారు. కంటి చూపు ద్వారా మనం ప్రపంచాన్ని దర్శించగలుగుతామని, విద్యాభ్యాసం, ఉపాధి, దైనందిన కార్యకలాపాలు, సామాజిక జీవనం సజావుగా సాగేందుకు చూపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ చాలామందిలో శుక్లాలు (ముత్యబిందు) ఏర్పడడం సహజమని తెలిపారు. శుక్లాలు వచ్చినప్పుడు వస్తువులు మసకగా కనిపించడం, చదవడంలో ఇబ్బంది కలగడం, వెలుతురు పట్ల అసౌకర్యం, రాత్రివేళల్లో సరిగా కనిపించకపోవడం, రంగులను స్పష్టంగా గుర్తించలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే చూపు మరింత తగ్గిపోయి సాధారణ జీవనం కూడా కష్టతరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. శుక్లాలకు ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన చికిత్స శస్త్రచికిత్సేనని కలెక్టర్ తెలిపారు. శస్త్రచికిత్స ద్వారా మసకబారిన కంటి లెన్సును తొలగించి, దాని స్థానంలో కృత్రిమ లెన్సు అమర్చడం వల్ల చూపు గణనీయంగా మెరుగుపడుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందుబాటులో ఉన్నాయని, కంటి చూపు సమస్యలు ఉన్న వారు సమీప ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కోరారు. శిభిరానికి సంబంధించి ఇతర వివరాలకు 9440029999 నంబర్ నందు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డా. వెలగ జోషి, సెక్రటరీ సీహెచ్. చిట్టిబాబు, సభ్యులు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి పట్టణ బీఎలవోలతో సమావేశం

**మంగళగిరి, జూన్ 13, మనం న్యూస్:** మంగళగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 10:00 గంటలకు మంగళగిరి పట్టణ బూత్ లెవెల్ ఏజెంట్స్ (ఆఔఅ) ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నాయకత్వంలో, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్స్ (ఆఔఅ) ఎన్నికల ప్రక్రియలో మరియు పార్టీ బలోపేతంలో పోషించాల్సిన కీలక పాత్ర గురించి, వారు చేయవలసిన పనుల గురించి విస్తృతంగా వివరించారు. బూత్ లెవెల్ ఏజెంట్స్ (ఆఔఅ) చేయవలసిన ముఖ్య పనులు:- ఓటర్ల జాబితా పరిశీలన: ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిరంతరం పరిశీలిస్తూ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల



సవరణ, మరియు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలి.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ ఛిల్లపల్లి మోహనరావు, మంగళగిరి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు దర్శి రమేష్ బాబు, పంచాయతీ రాజ్ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఫిరోజ్ మరియు మంగళగిరి పట్టణ పరిధిలోని (ఆఔఅ) నాయకులు, ప్రతినిధులు, వార్డ్ అధ్యక్షులు మరియు వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు మూల్పూరి వెంకటరత్నం కన్నుమూత

**హనుమాన్ జంక్షన్, జూన్ 13 (మనం న్యూస్) :**బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మూల్పూరి వెంకటరత్నం మునసబు గారు ( 90 ) శనివారం ఉదయం విజయవాడ ఆయుష్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో సేవలందించిన వెంకటరత్నం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు అత్యంత సన్నిహితులు. బాపులపాడు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులుగా , రైతు కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా అలాగే పార్టీలోని వివిధ హోదాల్లో పలు పదవులు అలంకరించి తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. అమరావతి ఉద్యమంలో పాల్గొని లక్ష రూపాయల విరాళం అందించారు. వీరికి ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు వున్నారు.ఆదివారం ఉదయం ఆరుగొలను గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వీరి మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



## ఓటరు జాబితా సవరణపై అవగాహన



**ఎస్ ఐ ఆర్ విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి**

**బొండా ఉమా**

విజయవాడ సెంట్రల్ జూన్ 13 ( మనం న్యూస్)ః ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)పై పూర్తి అవగాహనతో ప్రజలకు సరైన సమాచారం చేరవేయాలని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సింగ్నగర్లోని షాదీఖానాలో శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల ప్రక్రియలో ఎస్ఐఆర్ అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు తప్పులు, లోపాలు, నకిలీ నమోదులను గుర్తించి సరిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పారదర్శక ఎన్నికల వ్యవస్థకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల విషయంలో ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని, దానిని పరిరక్షించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులు, డివిజన్ బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కోసం రూ.6.51 లక్షల ఎల్ఓసీలు అందజేత

విజయవాడ పశ్చిమ జూన్ 13 ( మనం న్యూస్)ః మెరుగైన వైద్యం పొందేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల 51 వేల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో శనివారం కూటమి నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు.39వ డివిజన్ కామకోటి నగర్కు చెందిన కే. వెంకట అన్నపూర్ణ (55) దీర్ఘకాలిక నరాల వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు మరింత మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో ఎన్డీఏ కార్యాలయం ద్వారా వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల విలువైన ఎల్ఓసీని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం కన్వీనర్ పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు.అదేవిధంగా 52వ డివిజన్ కొత్తపేటకు చెందిన సీల రమాదేవి (42) హృద్రోగం, అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె చేసిన దరఖాస్తును పరిశీలించి సీఎం సహాయనిధి నుంచి రూ.4 లక్షల 51 వేల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. ఈ పత్రాన్ని మాజీ కార్పొరేటర్ అలుగుండ్ల సుబ్బారెడ్డి, ప్రత్తిపాటి శ్రీధర్ కలిసి బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యానికి దూరం కాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు కలిశెట్టి లక్ష్మణరావు, మారెళ్ల రామకృష్ణ, సుజనా మిత్ర కోఆర్డినేటర్ దొడ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకూ పోరాటం



**రాజధాని రైతులకు భూ సమీకరణ,భూ సేకరణ ప్యాకేజీ ఇవ్వాల్సిందే**

**ఏ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు**

గుంటూరు: జూన్ 13 (మనం న్యూస్ ప్రతినిధి)ః రాజధాని ప్రాంతం రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు నిరంతరం పోరాటం చేస్తామని ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు పేర్కొన్నారు. నిడుముక్కల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంత రైతుల కోసం గత 349 రోజులుగా నిర్విరామంగా రిలే నిరసన దీక్షలు చేస్తున్న కూడా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ముఖ్యంగా గతంలో ఇదే ప్రభుత్వం రైతులకు చెప్పిన హామీలు నెరవేర్చకుండా మరోసారి రెండవ ల్యాండ్ పూలింగ్ లో రైతుల వద్ద భూములను తీసుకోవడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వం స్పష్టంగా చెప్పిన ల్యాండ్ పూలింగ్ లో రైతులకు కోసం న్యాయపరమైన అంశాలను అమలు చేసిన తర్వాతే రెండో ల్యాండ్ పూలింగ్ చెప్పి రైతులను మోసం చేసి ఇప్పుడు మన రాజధానిలో మూడవ ల్యాండ్ పూలింగ్ నిడుముక్కల, మోతడక, తాడికొండ లో ప్రకటన చేయడం జరిగినది, ఇప్పుడు కూటమి ప్రభుత్వం 1,75 వేల ఎకరాలు ఈ 50 గ్రామాలలో రైతులు వద్ద వారి భూములను తీసుకోవాలని చూశారు కానీ ఏ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జే కే ఆర్ చేస్తున్న ఈ రిలే నిరసన దీక్ష వలన రైతులందరూ ఒకే మాట మీద ఉండి భూములు ఇవ్వకుండా ఉన్నారో ఆ భూములు ఉన్న రైతులు ప్రభుత్వం వాళ్లకి ఇచ్చేస్తే ప్రభుత్వం ఇచ్చిన ప్లాటు అమ్ముకుంటే ఎటువంటి ఉపాధి రైతులకు లేదని ఉపాధి కోల్పోతారని తెలియజేశారు,ఆ భూసమీకరణతో పాటుగా భూసేకరణ నాలుగు రెట్లు డబ్బులు ఇవ్వమని అడుగుతున్నట్లు రెండు ప్యాకేజీలు ఇవ్వమని డిమాండ్ చేశారు, రైతులు వద్ద ఉచితంగా భూములను తీసుకొని ఆ భూములను రియల్ ఎస్టేట్ ప్లాట్లు వేసి అమ్ముకోవాలని పరిపాలన మర్చిపోయి వ్యాపారం చేస్తున్నారని తెలియజేశారు,2014 నుండి 12 సంవత్సరంల వరకు పరిపాలన మర్చిపోయి రియల్ ఎస్టేట్ ప్రధానంగా ఈ రాజకీయ నాయకులు వ్యాపారం చేస్తున్నారని రైతులను పూర్తిగా మర్చిపోయారని తెలిపారు, నిన్న కూడా నిడుముక్కల తాడికొండ ఈ రెండు గ్రామాలకు అధికారులు ల్యాండ్ పూలింగ్ గురించి రావడం జరిగినది అసలు ఏమీ జరుగుతుంది అని వాస్తవాలు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు, ఈ రాజధాని ప్రాంత రైతులు భూ సమీకరణ భూ సేకరణ ప్యాకేజీ అడుగుతున్నామని డబ్బులు ఇవ్వండి మా భూములు ఇవ్వము అని స్పష్టంగా అధికారులను మరియు రాజకీయ నాయకులను తెలియజేస్తున్నామని మా ప్యాకేజీ గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లాలని కోరారు, రైతులు వద్ద తీసుకుంటున్న భూములను హాస్పిటల్స్ కు పెద్దపెద్ద పరిశ్రమల వేతలకు అప్పనంగా గజాల రేటులో వారికి నచ్చిన అతి తక్కువ వేల కట్టి కూటమి ప్రభుత్వం వాళ్లు ఇస్తున్నారని ఇక్కడి రైతులను అమాయకులు చేస్తున్నారా లేదా వారిని మభ్యపెడుతున్నారా మీ నాయకులు చెప్తున్నా అన్ని మాటలను ఇక్కడి రైతులు గమనిస్తున్నారని మీరే తెలివిగల వాళ్ళమని అనుకుంటే పొరపాటు పడ్డట్టే 12 సంవత్సరముల నుండి మీరు ఎన్ని లక్షల కోట్ల రూపాయల ఈ రాజధాని ప్రాంతానికి తీసుకొని వచ్చారు ఎంతమందికి ఉపాధి కల్పించారు అదేవిధంగా ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్, విమానాశ్రయం, రైల్వే స్టేషన్, రోడ్లు వీటి కొరకు ఇన్నిసార్లు ల్యాండ్ పూలింగ్ విడతల వారీగా చేయకుండా ఒకేసారి ల్యాండ్ పూలింగ్ చేసి ఎన్ని ఎకరాలు భూములు కావాలో అధికారులను అడిగి తెలుసుకొని రైతుల వద్ద ఆ భూములను సేకరించి భూ సమీకరణ మరియు భూ సేకరణ ప్యాకేజీ సంబంధించిన నాలుగు రెట్లు డబ్బులు ఎకరానికి కోటి రూపాయలు 1250 గజాలు ప్లాటు ఇవ్వవలసిందిగా కోరారు, ఇందుమూలంగా ఎటువంటి రైతు కుటుంబం గానీ ప్రజలు గాని ఇబ్బంది పడకుండా ఈ రాష్ట్ర 5 కోట్ల మంది ప్రజలకు ఉపయోగపడుతుందని వ్యక్తం చేశారు, ఈ 12 సంవత్సరాలు కంటే ఒక్క సంవత్సరం ప్రపంచంలో ఉన్న మేధావులు అందరూ మన రాష్ట్రానికి ఆహ్వానిస్తే అందరూ కలిసి త్వరగా అభివృద్ధి చేస్తారని తెలిపారు, రైతులు నాన్ లేఔట్ ప్లాట్లు వేస్తే విధ్వాంసాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని రైతులు ప్లాట్లు కూడా వేసుకోవద్ద వాళ్లు కూడా సంపాదించుకోవద్దా ఏ పాపాలు చేశారు రైతులు రాజధాని ప్రకటించిన తరువాత 2014లో 5 కోట్లు 6 కోట్లు చొప్పున భూములను నాశనం చేశారు గవర్నమెంట్ తీసుకొని వెంచర్ వేసిన భూములనే కొనండి,రైతులు వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనబాకండి అవి మంచి భూములు కాదు మేము ఇచ్చిన భూములే మంచి భూములు అని పబ్లిసిటీ చేసుకుంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారుల ద్వారా లేదా రాజకీయ నాయకుల ద్వారా రైతుల ప్రధాన డిమాండ్లను తెలుసుకొని నెరవేరుస్తారని ఆకాంక్షిస్తున్నాం.



# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నేతపై జనసైనికుల ఫిర్యాదు



**జగ్గయ్యపేట జూన్ 13 మనం న్యూస్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతపై జన సైనికులు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం జగ్గయ్యపేటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'రెండు సంవత్సరాల వెన్నుపోటు' కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు ఇొటూరి రాజగోపాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, జనసేన పార్టీ కార్యకర్తలు శనివారం పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్లో శనివారం ఎస్త్సై అర్జున్ కి ఫిర్యాదు చేశారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను అనుచిత వ్యాఖ్యలతో కించపరిచారని జనసైనికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఉప ముఖ్యమంత్రిని, ఒక బహిరంగ సభలోఅవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇది రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్య అని ఫిర్యాదులో పేర్కొన్నారు.విధానపరమైన విమర్శలు చేయలేక వ్యక్తిగత దూషణలకు దిగడం వైసిపి నేతల దిగజారుడుతనానికి నిదర్శనం అని లక్షలాది మంది జనసైనికులు, వీర మహిళల మనోభావాలు ఈ వ్యాఖ్యలతో దెబ్బతిన్నాయి' అని జనసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తునికి పాటి శివ, పెనుగంచిప్రోలు నీటి సంఘం నేత వై ఎన్ ఆర్ , పెనుగంచిప్రోలు మండల పార్టీ ఉపాధ్యక్షులు వినయ్ కుమార్ , మహిళ నేత కాకాని పద్మ తదితర జనసేన నాయకులు వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన తహసిల్దార్ శిరీషను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు



**జగ్గయ్యపేట జూన్ 13 మనం న్యూస్:** జగ్గయ్యపేట తాసిల్దారుగా పదవి బాధ్యతలు స్వీకరించిన శిరీష ను రెడ్ క్రాస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గయ్యపేట మండలానికి నూతనంగా విచ్చేసిన తహసిల్దార్ శిరీషని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబర్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, జగ్గయ్యపేట సబ్ బ్రాంచ్ చైర్మన్ గోగుశెట్టి మహేష్, ట్రెజరర్ మానేపల్లి నాగ బ్రహ్మం ల ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ శిరీష కి రెడ్ క్రాస్ ప్రతినిధులు ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం జగ్గయ్యపేట పరిధిలో రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ద్వారా చేపడుతున్న వివిధ సామాజిక, మానవతా సేవా కార్యక్రమాలను వివరించారు. స్థానికంగా రెడ్ క్రాస్ సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై, భవిష్యత్ కార్యాచరణపై తహసిల్దార్ తో సుదీర్ఘంగా చర్చించారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు స్థానిక సబ్ బ్రాంచ్ ప్రెసిడెంట్ గా తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా తహసిల్దార్ శిరీష హామీ ఇచ్చారు.

# భూగర్భ జలాల పెంపుదలకు రీఛార్జ్ బావుల నిర్మాణం చేపట్టాలి

## గన్నవరం మండలం ముస్తాబాద్లో పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**గన్నవరం: జూన్ 13, (మనం న్యూస్):** జిల్లాలో భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించి భవిష్యత్ నీటి అవసరాలకు స్థిరమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన రీఛార్జ్ బావుల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీఛార్జ్ బావి (రీఛార్జ్ షాఫ్ట్/ఇంజెక్షన్ వెల్) పనులను జిల్లా కలెక్టర్ శనివారం ఉదయం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అమలు విధానం, నిర్మాణ వ్యయం, భూగర్భ జలాల పునరుద్ధరణకు కలిగే ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉండే ప్రాంతాల్లో, ప్రీ-మాన్సూన్ కాలంలో భూగర్భ జల మట్టం ఆరు మీటర్ల కంటే లోతులో ఉన్న గ్రామాలను గుర్తించి రీఛార్జ్ బావుల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ఒక్కో రీఛార్జ్ షాఫ్ట్ నిర్మాణానికి సుమారు రూ.2 లక్షల వ్యయం అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూగర్భ జలాల స్థాయిని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలలో భాగంగా ముస్తాబాద్ గ్రామంలో జల ధార జలహారతి కార్యక్రమం కింద ఈ పైలట్ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. ప్రాజెక్టు అమలులో పొందిన అనుభవాలను సమీక్షించి, భూగర్భ జల శాఖ గుర్తించిన ఇతర అనుకూల ప్రాంతాల్లో కూడా ఇటువంటి రీఛార్జ్ బావుల నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించార. రీఛార్జ్ బావి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి సమర్థవంతంగా చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ముస్తాబాద్ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి...

అనంతరం జిల్లా కలెక్టర్ గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామంలో జరుగుతున్న పంటబోదె పూడికతీత పనులను పరిశీలించిన కలెక్టర్, అక్కడ పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వాహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల అభిప్రాయాలను తెలుసుకుంటూ వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.అనంతరం పనుల పురోగతి, చేపడుతున్న పనుల నాణ్యత, నిర్దేశిత లక్ష్యాల సాధన తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ గుణకర్, క్వాలిటీ కంట్రోల్, భూగర్భ జల శాఖ అధికారులు, తహసిల్దార్ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం




**జగ్గయ్యపేట జూన్ 13 మనం న్యూస్ :** జూన్ 14 న ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భారీ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శనివారం కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ఆవరణలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జూన్ 14న జరగనున్న 'ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని' పురస్కరించుకొని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శని వారం జగ్గయ్యపేట పరిధిలోని ప్రముఖ పరిశ్రమ 'కోహెన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్'ఫ్యాక్టరీ ఆవరణలో భారీ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ప్లాంట్ హెడ్/ఇంచార్జ్ శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు ఉత్సాహంగా తరలివచ్చి రక్తదానం చేశారు. మొత్తం 77 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని అందజేయడం విశేషం. రక్తదానం ప్రాణదానంతో సమానమని, సేకరించిన ఈ రక్తం అత్యవసర సమయాల్లో ఎందరో ప్రాణాలను కాపాడుతుందని రెడ్ క్రాస్ జిల్లా నిర్వహణా కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మరియు సబ్ బ్రాంచ్ చైర్మన్ గోగిశెట్టి మహేష్ పేర్కొన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి సహకరించిన కోహెన్స్ ప్లాంట్ హెడ్ శ్యాంప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ సురేష్ కి, ఇతర మేనేజ్మెంట్ సిబ్బందికి మరియు రక్తదానం చేసిన 77 మంది దాతలకు రెడ్ క్రాస్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియ చేశారు. రెడ్ క్రాస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్ మోహన్ ఆద్వర్యం లో శిబిరాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాలలో రెడ్ క్రాస్ ట్రెజరర్ మానేపల్లి నాగబ్రహ్మం, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు కోహెన్స్ ఫ్యాక్టరీ సిబ్బంది మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# వైసిపి నేత ఇంటూరి చిన్న వెన్నుపోటు వ్యాఖ్యల తో జగ్గయ్యపేటలో రాజకీయ దుమారం

**జగ్గయ్యపేట జూన్ 13 మనం న్యూస్:** వెన్నుపోటు రాజకీయాలు అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న) చేసిన పలు వ్యాఖ్యలు జగ్గయ్యపేటలో రాజకీయంగా పరస్పర విమర్శలతో దుమారాన్ని రేపుతున్నాయి. శుక్రవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి , మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్న), చంద్రబాబు పైన శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ పైన, జనసేన నేత సామినేని ఉదయభాను పైన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పైన ప్రత్యక్షంగాను పరోక్షంగాను చేసిన వ్యాఖ్యలు జగ్గయ్యపేటలో శనివారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఇంటూరి చిన్న వ్యాఖ్యలపై పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్లో జనసేన నేతలు పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు చేశారు. ఈ వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ నుంచి కూడా సోషల్ మీడియాలో ఘాటైన విమర్శలే వస్తున్నాయి. ఇక జనసేన సోషల్ మీడియా నుంచి ఆనాడు మున్సిపల్ చైర్మన్ గా ఇంటూరి చిన్న సామినేని ఉదయభాను ని కీర్తిస్తూ చేసిన వ్యాఖ్యలు అప్పటి ఫోటోలను జనసేన పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ పలు విమర్శలను గుప్పిస్తున్నారు. నిశ్శబ్దంగా ఉన్న జగ్గయ్యపేట రాజకీయాల్లో శుక్రవారం నాటి వైసిపి ర్యాలీ సందర్భంగా ఇంటూరి రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలతో జగ్గయ్యపేటలో రాజకీయ వేడి రగులుకున్నట్లు అయింది.కొద్ది నెలల్లో జరగనున్న పంచాయితీ ఎన్నికలకు ముందు చెలరేగిన ఈ రాజకీయ విమర్శల దుమారం ఎక్కడి వరకు సాగుతుంది అనే చర్చ సాగుతోంది.



# కేసానుపల్లిలో రూ. 2.36 కోట్ల అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు



**పల్నాడు జూన్ 13 (మనం న్యూస్ ప్రతినిధి)ః** ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడమే లక్ష్యంగా నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో స్థానిక శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు,తో కలిసి నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మొత్తం 2 కోట్ల 36 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మరియు నిర్మించబోయే వివిధ పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను శనివారం గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.ప్రతి ఇంటా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ఆశయం అని, అందుకు అనుగుణంగా కేసానుపల్లి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్పష్టం చేశారు. గ్రామంలో దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ కోటి 16 లక్షల 10 వేల రూపాయల వ్యయంతో మంజూరైన 'జలజీవన్ మిషన్' పనులను ఎంపీ గారు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కేసానుపల్లి గ్రామంలోని సుమారు 2500 కుటుంబాలకు నేరుగా నల్లా కనెక్షన్ ద్వారా సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని ఎంపీ తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించడం ద్వారా మహిళల నీటి కష్టాలు తీరడమే కాకుండా, కలుషిత నీటి వల్ల వచ్చే రోగాల నుండి విముక్తి లభించి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీ, ఆశాభావం వ్యక్తం చేశారు.తాగునీటి ప్రాజెక్టుతో పాటు గ్రామంలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడం కోసం 50 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన 'స్వర్ణ గ్రామ కార్యాలయం' భవనాన్ని ఎంపీ ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తూ 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సిమెంట్ (ఇఇ) రోడ్లను ప్రజల వినియోగం కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు.వీటితో పాటు గ్రామంలో మురుగునీటి సమస్యకు చెక్ పెడుతూ, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించేందుకు మరో 60 లక్షల రూపాయల విలువైన పనులకు గౌరవ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు,శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,పంచాయతీ అధికారులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడే..కమ్యూనిస్టు పార్టీ ( సీపీఐ ) ర్యాలీ

**దోనే పూడి శంకర్..**

**పెనుగంచిప్రోలు, జూన్ 13,(మనం న్యూస్).ః** రాష్ట్ర కమ్యూనిస్ట్ పార్టీ ( సీపీఐ ) రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు పెనుగంచిప్రోలు స్నేహ గార్డెన్ జరుగు తున్న సందర్భంగా ఆదివారం పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద నుండి కాజ్ వే మీదుగా స్నేహ గార్డెన్ వరకు గొప్ప ర్యాలీ జరుగనుందని ఎన్ టీ ఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దో నే పూండి శంకర్ తెలిపారు, ఈ ర్యాలీ లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా, తెలంగాణ రాష్ట్ర సీపీఐ ప్రధాన కార్యదర్శి కొత్త గుడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివ రావు, తదితరులు పాల్గొ నను న్నారు,కావున వామపక్ష వాదులు ప్రజలు ఈ ర్యాలీ లో పాల్గొని జయప్రదం చేయగలని శంకర్ కోరారు.



# యాప్ సహాయంతో ఇంటిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని గుర్తించి, అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ పోలీసులు



**గుంటూరు జూన్ 13 (మనం న్యూస్ ప్రతినిధి)ః** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యాధునిక ఆర్ టి జి ఎస్ ఏ ఐ సి సి టి వి, 360 సాంకేతిక వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి, ఒక ఇంటిలో చొరబడి, దొంగతనానికి పాల్పడిన ఘటనకు సంబంధించి నమోదైన కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును తెనాలి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఖమ్మం జిల్లా, మధిర మండలం, మడుపల్లి గ్రామానికి చెందిన బండి గోపి (తండ్రి: శ్రీనివాసరావు) అనే వ్యక్తి, ది.09.06.2026 తేదీన ఉదయం సుమారు 11:50 గంటల సమయంలో తెనాలి మండలం హాఫ్పేట గ్రామంలోని ఒక ఇంటిలో చొరబడి రూ.25,000 నగదు చోరీ చేసి, స్విఫ్ట్ డిజైర్ కారులో పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుడు అదే రోజు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ శ్రీ కె. ఆనంద్ గారు క్రైమ్ నెం.117/2026, సెక్షన్లు 331(3), 305(బ్) ఆఖి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.తెనాలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కే. నాయబ్ రసూల్ .పర్యవేక్షణలో విస్తృత స్థాయిలో గాలింపు చేపట్టి నిందితుడు ప్రయాణించిన మార్గంలోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి, నిందితుడు వినియోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు వివరాలను గుర్తించారు.అనంతరం వాహనానికి సంబంధించిన ఫోటోలు, నంబర్,తదితర వివరాలను ఆర్ టి జి ఎస్ ఏ ఐ సి సి టీ వి, 360 యాప్లో అప్లోడ్ చేయగా, ఆ వాహనం విజయవాడ నుంచి తెనాలి వైపు వస్తున్నట్లు సమాచారం లభించింది. ఈ మేరకు 13.06.2026 తేదీ ఉదయం సుమారు 11:00 గంటలకు నందివెలుగు జంక్షన్ వద్ద పోలీసులు వాహనాన్ని అడ్డగించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి చోరీకి వినియోగించిన స్విఫ్ట్ డిజైర్ కారుతో పాటు రూ.5,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ,ఆర్ టి జి ఎస్ ఏ ఐ .సి సి టీవీ , 360 యాప్ ద్వారా పరారీలో ఉన్న నేరస్తులు, మిస్సింగ్ వ్యక్తులు, చోరీకి గురైన వాహనాలను వేగంగా గుర్తించి ట్రేస్ చేయడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ ని, దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని, వారికి మార్గనిర్దేశం చేసిన తెనాలి రూరల్ సీఐ ఎస్.కే. నాయబ్ రసూల్ ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,ఐపీఎస్ అభినందించారు.నిందితుని నేర చరిత్ర.నిందితుడిపై తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి.వాటిలో:కల్లూరు పోలీస్ స్టేషన్ - 1 కేసు

- మధిర టౌన్ పోలీస్ స్టేషన్ - 6 కేసులు
- టేకులపల్లి పోలీస్ స్టేషన్ - 1 కేసు
- మరిపెడ పోలీస్ స్టేషన్ - 1 కేసు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలో - 2 కేసులు

మొత్తం 11 కేసులు ప్రస్తుతం వివిధ కోర్టుల్లో విచారణలో ఉండగా, అదనంగా సుమారు 20 కేసులు కోర్టుల ద్వారా కొట్టివేయబడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా వేడుకలు



**గుంటూరు జూన్ 13 (మనం న్యూస్ ప్రతినిధి)ః**స్థానిక గుంటూరులోని బ్రాడీపేట కార్యాలయంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు యువత నాయకులు మోహన్ గోపికృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డొక్కా మాణిక్య వరప్రసాద్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు.అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పరిపాలన పూర్తి చేసుకోవడం సంతోషకరమైన విషయం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ప్రజా సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రాష్ట్ర పునర్నిర్మాణం,మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళా సాధికారత, రైతు సంక్షేమం వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజల్లో నూతన ఆశలను నింపాయి.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకత, జవాబుదారీతనం,అభివృద్ధి అనే లక్ష్యాలతో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాను. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నాను. కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి,నారా లోకేష్ కి,మంత్రివర్గ సభ్యులకు, ఎమ్మెల్యేలకు మరియు కూటమి నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కొనిదే మోహన్ గోపికృష్ణ, మాజీ యార్డ్ డైరెక్టర్ రాజపుత్ర సత్యం సింగ్, టిడిపి రాష్ట్ర నాయకులు మానుకొండ శివ ప్రసాద్,టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరుచూరి సంజీవరావు, టిడిపి నగర నాయకులు మండవ వాసు, దోవ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు

# ఐఐటి లో సీట్లు సాధించిన జగ్గయ్యపేట మండల విద్యార్థినులు






**జగ్గయ్యపేట జూన్ 13 మనం న్యూస్ ః** జగ్గయ్యపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ట్రిబుల్ ఐ టీలో ముగ్గురు విద్యార్థినిలు సీట్లు సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు తెలిపారు. జగ్గయ్యపేట మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన జి లోహిత నూజివీడు ట్రిబుల్ ఐటీ క్యాంపస్ కు, పోచంపల్లి గ్రామానికి చెందిన బి లిఖిత ఒంగోలు క్యాంపస్ కు, అలానే జగ్గయ్యపేట మండలంలోని మల్కాపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన అంబోజి శ్రీలక్ష్మి ఒంగోలు ఐఐటి క్యాంపస్ కు ఎంపికైనట్లు ఎంఈఓ ఎల్ చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ట్రిబుల్ ఐటీ క్యాంపస్ లకు ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓ చిట్టిబాబు అభినందించారు.

# రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**



**మచిలీపట్నం: జూన్ 13,(మనం న్యూస్):** రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన రక్తదాతలు, స్వచ్ఛంద సేవకులను సత్కరించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 14న నిర్వహించడం వెనుక శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్స్టీనర్ సేవలు ఉన్నాయని తెలిపారు. రక్త గ్రూపుల వ్యవస్థను కనుగొనడం ద్వారా ఆధునిక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఆయనకు నోబెల్ బహుమతి లభించిందన్నారు. రక్త గ్రూపుల గుర్తింపు లేకముందు రక్త మార్పిడి ప్రక్రియలో అనేక సమస్యలు ఎదురయ్యేవని, ఆయన పరిశోధనలు వైద్యరంగానికి ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు. రక్తదానం అనేది ఒక గొప్ప మానవతా సేవ అని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని కలెక్టర్ అన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న వారందరూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పట్టణ ప్రాంతాల్లో రక్తదానం ఒక సామాజిక బాధ్యతగా, అలవాటుగా మారిందని, అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృత స్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. జిల్లాలో త్వరలోనే పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా రక్తదానం పట్ల మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి రక్తదాత తాను రక్తదానం చేసిన విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడంతో పాటు మరో వ్యక్తిని కూడా రక్తదానానికి ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి సారి రక్తదానం చేసేటప్పుడు కనీసం ఒక కొత్త రక్తదాతను తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు వస్తే జిల్లాలో రక్తదాతల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు.అలాగే బాంబే బ్లడ్ గ్రూప్ వంటి అరుదైన రక్త గ్రూపులు కలిగిన దాతల వివరాలతో ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటు చేయడం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అత్యవసర సమయాల్లో అరుదైన రక్తం అందుబాటులోకి రావడానికి ఇటువంటి వ్యవస్థ ఉపయోగపడుతుందని తెలిపారు. రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృష్ణా జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ డీపీటీఓ, కె. వెంకటేశ్వర్లు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి. కరుణ కుమార్, నందివాడ మండల ఎంఆర్ఓ ఎన్. గురుమూర్తి రెడ్డి, డీఆర్ఓ, సిసి తూము వెంకటేశ్వరరావు, కస్తూరి విజయకుమార్ (చల్లపల్లి రక్తదాత), రక్తదాతల ప్రోత్సాహకుడు (డోనర్ మోటివేటర్) వి. నవీన్ కుమార్, లేబాక వెంకటేశ్వరరావును జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డిఆర్కె ప్రసాద్, జనరల్ సెక్రెటరీ బి శంకర నాథ్, ట్రెజరర్ బి సుకుమార్, జిల్లా మలేరియా వైద్య అధికారి డాక్టర్ వెంకటరావు, రక్తదాతలు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.



## 'నవ్విపోదురు గాక నాకేం సిగ్గు' అన్నట్లుగా ఉంది ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తీరు

**నందిగామ,జూన్13(మనం న్యూస్):** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్ కుమార్ లపై... తంగిరాల సౌమ్య నిన్నటి పత్రిక ప్రకటనను ఖండిస్తూ... ప్రకటన విడుదల చేసిన పార్టీ నాయకులు ... వాస్తవాలు మాట్లాడలేక... అబద్దాలతో కాలం గడిపే తీరు... నందిగామ తెలుగుదేశం పార్టీ నేతలకే చెల్లింది... ఎవరి బిడ్డనో - మా బిడ్డగా (అనగా) ఎదుటివారి కష్టాన్ని - మా కష్టంగా చెప్పుకునేంత దిక్కుమాలిన స్థితిలో మీరు ఉండటానికి చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు ...నందిగామకు వంద పడకల ఆసుపత్రి - కేంద్రీయ విద్యాలయం - శివాలయాభివృద్ధి నిధులు ఎవరు సాధించారో - ఎవరి ప్రభుత్వంలో మంజూరయ్యాయో ప్రజలందరికీ తెలుసు... అయినా సరే నిస్సిగ్గుగా ఈ తెలుగుదేశం ప్రభుత్వంలో అవి మంజూరయ్యాయని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చెప్పుకోవటం నిజంగా ఆమె చౌకబారు ప్రయత్నానికి నిదర్శనం గా మిగిలిపోతుంది ...

### టిడిపి నేతలు సిగ్గు విడిచి చెప్పుకోవడం.

నందిగామకు వంద పడకల ఆసుపత్రి - కేంద్రీయ విద్యాలయం - శివాలయం అభివృద్ధి కి ... అసలు ఆలోచన చేసింది ఎవరు ? శ్రీకారం చుట్టింది ఎవరు ? నిధులు మంజూరు చేయించింది ఎవరు ? అనేది.... సిగ్గు విడిచిన తెలుగుదేశం నేతలకు తప్ప.... ప్రజలందరికీ తెలుసు. గత జగనన్న ప్రభుత్వంలో 5 ఏళ్ళ పాటు ఎన్ని కాగితాలు పట్టుకొని -ఎన్ని ప్రణాళికలతో ఎన్నిసార్లు ముఖ్యమంత్రిని - మంత్రులను -ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసి అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు విన్నవిస్తే... అవి మంజూరయ్యా అందరికీ తెలుసు... జగనన్న ప్రభుత్వంలో మంజూరైన జీవోలు - ప్రభుత్వ ఉత్తర్వులతో సహా... అందజేస్తున్నాం చూడండి. గత 5 సంవత్సరాల్లో అధికారంలోకి రాగానే 2 ఏళ్ళు కరోనా రూపంలో వృధాగా పోయిన - ఆ తర్వాత నందిగామకు 100 పడకల ఆసుపత్రి - కేంద్రీయ విద్యాలయం తీసుకురావాలని ప్రణాళిక చేసి... ఎంత కాలం పాటు తిరిగితే అవి మంజూరయ్యాయో అందరికీ తెలుసు.

### 'డమ్మీ ఎమ్మెల్యే' గా తంగిరాల సౌమ్య పనితీరు ..

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మళ్ళీ డమ్మీ గానే మిగిలిపోయారు. ఆమె చేతిలో ఏ అధికారం లేదు ! ఆమె సొంతంగా ఒక్కటే ఏ నిర్ణయము తీసుకోలేదు. అని మీ తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులే బహిరంగంగా చెప్పుకుంటారు. దాని గురించి మీరు ప్రత్యేకంగా ఎన్ని వర్ణించిన ఎవరు నమ్మరు.మాయమాటలతో - విష ప్రచారాలతో అధికారంలోకి వచ్చారు తప్పితే... మిమ్మల్ని చూసి -మీ పరిపాలన చూసి ప్రజలు గెలిపించారనుకోవటం మీ అవివేకం తప్ప ఇంకొకటి కాదు. మీరు శక్తి స్వరూపిణి కాదు - భుక్తి స్వీకరిణి అని ... అందరికీ తెలుసు... అనగా కమిషన్లు భుజించటం తప్ప చేసేదేమీ లేదని.. ఎక్కడ చూసినా బాబు.. ఏ మండలంలో విన్న బాబు... ఏ పని కావాలన్నా బాబు... ఏ రేటు మాట్లాడాలన్నా బాబు.. ఏ కమిషన్ మాట్లాడాలన్నా బాబు.. ఏ ట్రాన్స్ఫర్ కావాలన్నా బాబు... ఏ పోస్టింగ్ కావాలన్నా బాబు.. ఏ అక్రమం చేయాలన్నా బాబు.. ఇదంతా ఆ కంచికచర్ల బాబు పాలన తప్పితే... మీ పాలన ఏమీ లేదని.. మీరు కచ్చితంగా డమ్మీ యే అని అందరికీ తెలుసు

### అబద్దాలతో కాలం గడిపే తీరు.

నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మహమ్మద్ మస్తాన్, కౌన్సిలర్లు యాకూబ్ అలీ, పాకాలపాటి కిరణ్, ఒర్సు లక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు మన్నెం దాసు, షేక్ జాఫర్, పాములపాటి రమేష్ తదితరులు పత్రికా ప్రకటన విడుదల చేశారు

# జిల్లా అభివృద్ధి, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం కృషి అభినందనీయం

**తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ముందుకు**

**పైలెట్ ప్రాజెక్టుగా మచిలీపట్నం మండలంలోని పెదపట్నం, పల్లెతుమ్మలపాలెం గ్రామాల ఎంపిక**

**మచిలీపట్నం: జూన్ 13,(మనం న్యూస్):** జిల్లా అభివృద్ధి, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు జయన్, యాదవ్ శనివారం మధ్యాహ్నం మచిలీపట్నం నగరంలోని రహదారులు భవనాల శాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సౌకర్యాల కల్పన, మహిళా సాధికారత, బీచ్ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడం, యువతకు ఉపాధి కల్పన శిక్షణలు, సివిల్ సర్వీసెస్ ఆశావహులకు ఉచిత శిక్షణ అంశాలపై మంత్రి, జిల్లా కలెక్టర్తో సంస్థ ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. తీర ప్రాంత గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించే దిశగా పైలెట్ ప్రాజెక్టుగా మచిలీపట్నం మండలంలోని పెదపట్నం, పల్లెతుమ్మలపాలెం గ్రామాలను ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆయా గ్రామాల్లో చెరువు నీటిని శుద్ధి చేసే ప్రత్యేక ప్యూరిఫికేషన్ యూనిట్లను ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటిని పైప్లైన్ల ద్వారా ప్రతి ఇంటికి నేరుగా సరఫరా చేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు అమలు ద్వారా లభించే అనుభవాల ఆధారంగా తీర ప్రాంతంలోని ఇతర గ్రామాలకు కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనపై మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ముందుకు వచ్చిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులను వారు ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మహిళలకు మిషన్ కుట్టు, అల్లికలు, ఎండు చేపలు రొయ్యల వ్యాపార నిర్వహణపై శిక్షణ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అలాగే ప్రతి ఏడాది 20 మంది సివిల్ సర్వీసెస్ ఆశావహులకు ఉచిత శిక్షణ అందించి యువతకు ప్రోత్సాహం కల్పించనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు సంస్థ ప్రతినిధులు మచిలీపట్నం మండలంలోని పెదపట్నం గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి తుపాను షెల్టర్ వద్ద ఓవర్ హెడ్ ట్యాంకు, గ్రామంలో నీటి సరఫరా స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఈ సుధాకర్, ఏఈ సుగుణ, డి ఆర్ డి ఎ విభాగం అధికారులు ఈ చర్చలో పాల్గొన్నారు.



